క్లుప్తంగా

సాదాసీదాగా 'జమ్మికుంట' సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న రాజేశ్వర్‌రావు

జమ్మికుంట: జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు అధ్యక్షతన కమిషనర్ అయాజ్ ఆధ్వర్యంలో కౌన్సిల్ సర్వసభ్య సమావేశం శనివారం సాదాసీదాగా జరిగింది. మున్సిపాలిటీ అభివృద్ధికి 47 అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ప్రతి వార్డుకు రూ.5లక్షలు, రుద్రభూమికి రూ.50లక్షల నిధులు కేటాయించారు. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వార్డుల్లో ఫాగింగ్ మిషన్‌కు సంబంధించిన సామగ్రిని కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దేశిని స్వప్న కోటి, మేనేజర్ భూపాల్‌రెడ్డి, ఏఈ, సీనియర్ అసిస్టెంట్లు, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కనీస వసతులు కల్పించాలి

సైదాపూర్: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో కనీస మౌలిక వసతులు కల్పించాలని మాజీ ఎంపీపీ పాడిశెట్టి వెంకట్రాజం శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఇటీవల ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో మహిళా ప్రయాణికులు ఎక్కువయ్యారన్నారు. బస్టాండ్‌లో కనీస సౌకర్యాలైన మరుగుదొడ్లు, నీరు, విద్యుత్ దీపాల్లేక మహిళా ప్రయాణికులు తిప్పలు పడుతున్నారన్నారు.

లైబ్రేరియన్‌కు సన్మానం



లైబ్రేరియన్ దంపతులను సన్మానిస్తున్న కళాశాల అధ్యాపకులు

హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లైబ్రేరియన్‌గా పని చేస్తున్న కందకట్ల రమేశ్ ఉద్యోగ విరమణ కార్యక్రమం శనివారం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డా.పి.ఇందిరాదేవి మాట్లాడుతూ.. డిగ్రీ కళాశాలలో 37 సంవత్సరాలపాటు లైబ్రేరియన్‌గా సేవలందించి విరమణ చేయటం హర్షణీయమన్నారు. అధ్యాపకులు శాలువాతో సత్కరించారు. కేడీసీ ప్రిన్సిపాల్ డా.జి.రాజిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ పి.లక్ష్మీనరసింహమూర్తి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా.పి.దినకర్, అకడమిక్ కోఆర్డినేటర్ డా.జి.శ్రీనివాస్ తదితరులున్నారు.

వారసంత వేలం వాయిదా

శంకరపట్నం: కేశవపట్నం గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన వారసంత వేలం వాయిదా పడినట్లు కార్యదర్శి నర్సయ్య తెలిపారు. కేశవపట్నంలో ప్రతి సోమవారం వారసంత జరుగుతుండగా.. ఇటీవల గడువు ముగిసింది. కొత్తగా వారసంతకు వేలంపాట నిర్వహించగా.. రూ.2,30,000కు పలికింది. సరైన ధర రాలేదని వాయిదా వేశారు. త్వరలో వేలంపాట నిర్వహించేందుకు అధికారుల అనుమతి తీసుకోనున్నట్లు కార్యదర్శి తెలిపారు.

ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలి

సైదాపూర్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల మైదానంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని సామాజిక కార్యకర్త గాదపాక కుమార్‌రాజా డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో మాట్లాడారు. కలుషిత ఆహారం, ఒత్తిడితో ఆరోగ్య సమస్యలు దూరం చేయడానికి నిత్య జీవితంలో వ్యాయామం, వాకింగ్ తప్పనిసరయిందన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌ను త్వరలో కలిసి వినతి పత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు.

పరామర్శ



నివాళి అర్పిస్తున్న జాడి బాల్‌రెడ్డి

రామడుగు: వెదిర గ్రామానికి చెందిన వరవ్వ అనే మహిళ విద్యుదాఘాతంతో మృతిచెందగా.. శనివారం బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి పరామర్శించారు. 25 కిలోల బియ్యం అందజేశారు. నాయకులు నాగుల వెంకటేశ్‌గౌడ్, ముత్యం మహేందర్‌గౌడ్, పర్శారాం, మురళి పాల్గొన్నారు.

చెరువు మట్టిపై అభ్యంతరం

శంకరపట్నం: కేశవపట్నంలో శనివారం నిర్వహించిన గ్రామసభలో పెద్ద చెరువులో మట్టిని తీయొద్దని మెజార్టీ ప్రజలు అభ్యంతరం చెప్పారు. కేశవపట్నం గ్రామానికి చెందిన ఇటుక బట్టీల వ్యాపారి చెరువు మట్టికి ఇటీవల గ్రామ పంచాయతీ అధికారులకు దరఖాస్తు చేసుకున్నాడు. ఈ మేరకు గ్రామ పంచాయతీ ఆవరణలో గ్రామసభ నిర్వహించగా.. మొక్కుబడిగా ప్రజలు హాజరయ్యారు. పెద్ద చెరువులో మట్టి తీయొద్దని, ఇటుక బట్టీలకు చెరువు మట్టి తరలించేందుకు అనుమతివ్వొద్దని మెజార్టీ ప్రజలు అభ్యంతరం చెప్పారు. ఎంపీడీవో శ్రీవాణిని వివరణ కోరగా.. అభ్యంతరాలపై ప్రజలు లిఖితపూర్వకంగా ఇవ్వలేదన్నారు.

తూము లీకేజీతో నష్టం

- రబీలో ఎండిన పొలాలు
- సంవత్సరకాలంగా కొనసాగిన వైనం
- వృథాగా పోయిన సాగునీరు
- లీకేజీ నీటిలో కొట్టుకుపోయిన రూ.25లక్షల విలువ గల చేప పిల్లలు



లీకేజీ అయిన సంగోజిపేట చెరువు తూము

చిగురుమామిడి: సంగోజిపేట చెరువు తూము నుంచి సాగునీరు సంవత్సరకాలంగా లీకేజీ అవుతున్నా.. ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 17 గ్రామాల చెరువుల కంటే సంగోజిపేట చెరువు పెద్దది. దీని ఆయకట్టు దాదాపు 535 ఎకరాలుగా ఉంది. ప్రతి వర్షాకాలంలో చెరువు నిండి మత్తడి పడిందంటే చాలు.. 2పంటలు పుష్కలంగా పండుతాయి. కాని సంవత్సరకాలం నుంచి ఒకే పంట పండుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గడిచిన రబీలో చెరువులో నీరు లీకేజీ కావడంతో చాలామంది రైతులు చెరువు కట్ట కింద సాగు చేయలేదు. చేసిన రైతుల పంట పొలాలు చేతికి రాకముందే ఎండిపోవడంతో తాము ఆర్థికంగా నష్టాలపాలయ్యామని వాపోతున్నారు.

మూడు గ్రామాల రైతుల సేద్యం

సంగోజిపేట చెరువు కింద గాగిరెడ్డిపల్లి, ఇందుర్తి, గునుకులపల్లె గ్రామాలకు చెందిన రైతుల పంట పొలాలున్నాయి. ప్రతి ఏటా ఈ మూడు గ్రామాల రైతులు వానాకాలం, రబీల్లో పంట పొలాలు 535 ఎకరాల్లో సాగు చేస్తుంటారు. గడిచిన సంవత్సరకాలంగా నీరు లీకేజీ కావడం వల్ల రైతులు పొలాలు దున్నలేదు.. నాట్లు వేయలేదు. ఒక వసలు నాట్లు వేయక తమ మనుగడ సాధించడం కష్టతరమని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కిందికి వెళ్లిన చేప పిల్లలు..

సంగోజిపేట చెరువు తూము లీకేజీ నీటిలో దాదాపు రూ.25లక్షల నుంచి రూ.30లక్షల విలువ గల చేప పిల్లలను ముదిరాజ్ కులస్తులు నష్టపోయినట్లు చెప్పారు. మాజీ సీఎం కేసీఆర్ సబ్సిడీపై ఇచ్చిన చేప పిల్లలు, ముదిరాజ్ సంఘం నుంచి రూ.3లక్షల విలువ గల చేప పిల్లలను చెరువులో వేశామని, అవి పెరిగి పెద్దగా అయిన తరువాత తాము చేపలు పట్టి అమ్ముకుంటే దాదాపు రూ.30 లక్షలు వచ్చేవన్నారు. నీటి లీకేజీ వల్ల రైతులతోపాటు మేము కూడా నష్టపోయామని పలువురు ముదిరాజ్‌లు వాపోయారు.

పరిశీలించిన అధికారులు

ఇందుర్తి సంగోజిపేట చెరువు తూము లీకేజీపై సాక్షి దిన పత్రికలో ఆగస్టు 14న కథనం ప్రచురితమైంది. ఆ మరుసటి రోజున ఐబీ అధికారులు సంగోజిపేట చెరువు కట్ట, లీకేజీలను పరిశీలించారు. లీకేజీ అవుతున్న చెరువు కింద భాగంలో తూము నుంచి నీరు వచ్చేచోట జేసీబీ సాయంతో మట్టిని పోసి చేతులు దులుపుకున్నారు. పోసిన మట్టి లీకేజీ అయిన నీటిలో కొద్దికొద్దిగా కోసుకుంటూ వెళ్లిపోయింది. దీంతో చెరువులోని సాగునీరంతా కింది ప్రాంతానికి వృథాగా వెళ్లిపోయింది. అప్పటి నుంచి నేటి వరకు రబీ పంట కాలం ముగిసినా.. ఇరిగేషన్ అధికారులు శాశ్వత మరమ్మతులు చేపట్టకపోవడం దారుణమని ఆయకట్టు కింది రైతులు విమర్శిస్తున్నారు.

మళ్లీ చెరువు నిండితే..

వానాకాలం సీజన్ ప్రారంభమైంది. ఇప్పటికే మూడు, నాలుగు వర్షాలు పడ్డాయి. భూమంతా నీటితో నిండి ఉంది. ఏ క్షణంలోనైనా భారీ వర్షం కురిస్తే సంగోజిపేట చెరువు ఇట్టే నిండిపోతుంది. మిగిలిన చెరువుల కంటే ఈ చెరువుకు వరదపోటు ఎక్కువగా ఉంది. మళ్లీ పాతకథే మొదలు కానుందని 3గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువులో చేరే నీరంతా కింది భాగానికి లీకేజీ ద్వారా పోయే ప్రమాదముంది. ఇప్పటికైనా తక్షణ చర్యలు చేపట్టని పక్షంలో చెరువు కింది రైతులు రబీ పంటలు నష్టపోయే ప్రమాదముంది.

ఆందోళనకు సిద్ధం..

ఇందుర్తి సంగోజిపేట చెరువులోని నీరు లీకేజీ ద్వారా బయటకు పోతున్నందున అధికారులు తక్షణ చర్యలు చేపట్టని పక్షంలో తాజా మాజీ సర్పంచులు, ప్రస్తుతం ఉన్న ఎంపీటీసీలు, రైతులు, ప్రజా సంఘాల నాయకులు ఆందోళన చేసేందుకు సన్నద్ధమవుతున్నట్లు తెలిపారు. సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు, మాజీ జెడ్పీటీసీ అందె స్వామి, మాజీ సర్పంచ్ సన్నీళ్ల వెంకటేశం, కొలిపాక శ్రీనివాస్, కిషన్, మంద శ్రీనివాస్, పలువురు ఇప్పటికే పలుమార్లు అధికారులకు చెప్పినా వినడం లేదని, ధర్నా, ఆందోళనా కార్యక్రమాలు రైతులను సమీకరించి చేపడతామని హెచ్చరించారు.

పట్టించుకోవడం లేదు



సంగోజిపేట చెరువు కింద వ్యవసాయం చేసే రైతులు ఈసారి చాలా నష్టపోయారు. చెరువులోని సాగు నీరంతా లీకేజీ అవుతోందని సాక్షి దిన పత్రికలో వార్త వచ్చిన తర్వాత ఐబీ అధికారులు వచ్చి చూశారు. కాని శాశ్వత మరమ్మతులు చేపట్టలేదు. ఈ సంవత్సరం కూడా అదే పరిస్థితి ఎదురయ్యే అవకాశముంది.

– జెల్ల కిషన్, రైతు, గాగిరెడ్డిపల్లి

చేపలు చనిపోయాయి



సంగోజిపేట చెరువులోని సాగు నీరు లీకేజీ ద్వారా కింది ప్రాంతానికి వృథాగా పోవడంతో.. చెరువులో మాజీ సీఎం కేసీఆర్ ఇచ్చిన చేప పిల్లలతోపాటు తమ సంఘం నుంచి చేప పిల్లలను చెరువులో వేశాం. వర్షం పడిన నుంచి నీరు, చేపలు కింది ప్రాంతానికి వెళ్లిపోయాయి. అవి పెద్దవి కాకుండా చిన్న సైజులో ఉండగానే తూము నుంచి లీకైన నీటిలో కొట్టుకుపోయి చనిపోయాయి. దీంతో మూడు గ్రామాలకు చెందిన ముదిరాజ్ కులస్తులు దాదాపు రూ.25లక్షల నుంచి రూ.30లక్షల వరకు నష్టపోయారు.

– శ్రీనివాస్, ముదిరాజ్ సంఘం నాయకుడు, గాగిరెడ్డిపల్లి

మరమ్మతులు చేపట్టాం

సంగోజిపేట చెరువు లీకేజీకి తాత్కాలికంగా సిమెంట్ పనులు చేపట్టాం. సొంతంగా రూ.5వేలు ఖర్చు చేసి లీకేజీని మూశాం. పూర్తిస్థాయిలో లీకేజీ నివారణ కోసం రూ.15.50లక్షలతో అంచనా వేసి హైదరాబాద్‌కు పంపాం. మంజూరై రాగానే టెండర్లు పిలిచి పనులు చేపడతాం.

– సుధీర్, ఏఈఈ, ఇరిగేషన్ శాఖ, చిగురుమామిడి

సేవలతోనే చిరకాల గుర్తింపు

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ
- గన్నేరువరం మండల చివరి సర్వసభ్య సమావేశం



ఎంపీపీ, ఎంపీటీసీలు, అధికారులతో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

గన్నేరువరం: ప్రజా జీవితంతో ప్రజాప్రతినిధినిగా ఎన్ని గొప్ప పనులు చేసినా సంతృప్తి ఉండదని, చేసిన మంచి పనులతో ప్రజల్లో చిరకాల గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మరోసారి ప్రజాప్రతినిధులు ఎన్నికై మరిన్ని గొప్ప పదవులు, పనులు చేపట్టాలని ఆకాంక్షించారు. గన్నేరువరంలోని మండల పరిషత్ ఆవరణలో శనివారం ఎంపీపీ లింగాల మల్లారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన చిట్టచివరి మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గన్నేరువరం మండల పరిషత్ తొలి మండల పరిషత్ అధ్యక్షుడిగా ఐదు సంవత్సరాలు ప్రజాసేవ చేయడానికి అవకాశం ఇచ్చిన ప్రజలు, ఎంపీటీసీలు, నాయకులకు ఎంపీపీ లింగాల మల్లారెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఐదు సంవత్సరాలు ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొన్నా.. తోటి ప్రజాప్రతినిధులు, అధికారులతో ప్రజాసమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేశానన్నారు. ఎంపీపీగా ప్రజాసేవ చేయడం సంతృప్తినిచ్చిందని, సహకరించిన అందరికీ రుణపడి ఉంటానని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే కవ్వంపల్లి మాట్లాడుతూ.. గ్రామాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో రాజకీయాల్లోకి వచ్చి ఐదు సంవత్సరాలు ప్రజలకు సేవలందించిన ఎంపీటీసీలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాప్రతినిధిగా ఎన్నికవడం గొప్ప వరమన్నారు. ఎన్నికల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించి ప్రజాజీవితంలో తన పాత్ర పోషించాలని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో జవహర్‌లాల్ నెహ్రూ, గాంధీ, వల్లభాయ్‌పటేల్, మరెందరో మహా నాయకులు ఎన్నో అవస్థలు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. ప్రజాఉద్యమంలో ఎన్నో ఒడిదొడుకులు, సవాళ్లు ఎదుర్కొని కేజ్రీవాల్ ఢిల్లీకి సీఎం అయ్యారన్నారన్నారు. పదవులు లేకపోయినా పనులు చేయాలనే సంకల్పమున్నా వారికి ప్రజాజీవితంలో ప్రజల నుంచి ఎల్లప్పుడూ మద్దతుంటుందని అన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికి క్షేత్రస్థాయిలో పర్యటించనున్నట్లు తెలిపారు. అపరిష్కృత సమస్యలపై పంచాయతీరాజ్ అధికారులతో సమావేశం నిర్వహించి ప్రత్యేక దృష్టి పెట్టామని, వాటి పరిష్కారానికి నిధుల మంజూరు కోసం మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లామన్నారు. గ్రామాల్లో ఎటువంటి సమస్యలున్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని, తప్పకుండా పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎంపీటీసీలు, అధికారులను శాలువాతో సన్మానించి మెమొంటోలను అందజేశారు. తహసీల్దార్ భిక్షపతి, ఎంపీడీవో శంకర్, వైస్ ఎంపీపీ స్వప్న, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ఎంపీటీసీలు రాజేశం, ఏలేటి స్వప్న, బొడ్డు పుష్పలత, కోఆప్షన్ సభ్యుడు రఫీ, ఎంపీవో నర్సింహారెడ్డి, ఏవో కిరణ్మయి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ ఉద్యోగులకు సన్మానం

తిమ్మాపూర్: ఎల్‌ఎండీకాలనీలోని ఎస్సారెస్పీ గెస్ట్‌హౌస్‌లో ఎస్సారెస్పీ ఉద్యోగుల ఉద్యోగ విరమణ సన్మాన మహోత్సవం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఇరిగేషన్ శాఖ ఈఎన్‌సీ బి.శంకర్, ఎస్ఈ శివకుమార్ హాజరయ్యారు. ప్రభుత్వ నీటిపారుదల శాఖలో వివిధ హోదాల్లో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన బండి కుమార్, జి.కనకయ్య ఎస్.లీల, ఆర్.రామచంద్రయ్యను శాలువాతో సత్కరించారు. జ్ఞాపికలు అందజేశారు. ఈఈ సమ్మయ్య, టీఎన్జీవో జిల్లా కార్యదర్శి సంగేం లక్ష్మణరావు, పోలు కిషన్, ఎన్‌టీపీపీ–గెజిటెడ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు, అధికారులు, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో నో బ్యాగ్ డే



నృత్యం చేస్తున్న విద్యార్థులు

జమ్మికుంట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాశాఖ ప్రతి నెల నాలుగో శనివారం నో బ్యాగ్ డే నిర్వహిస్తోంది. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి జిల్లాపరిషత్ పాఠశాలలో శనివారం నిర్వహించారు. బాలసభ నిర్వహించి కవితలు, గేయాలు, పాటలు, దేశ భక్తి గేయాలు, నృత్యాలు చేశారు. ఉపాధ్యాయులు రాజేందర్, రమేశ్, అవినాశ్, ఐలయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

చిత్ర కథ



వీణవంక: రామకృష్ణాపూర్ గ్రామంలో చెక్ డ్యామ్ నిర్మిస్తున్న కట్ట మధ్యలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రమాదం పొంచి ఉంది. అటువైపుగా వెళ్లే మనుషులు, మూగజీవాలకు ప్రమాదం వాటిల్లే పరిస్థితి ఉంది. పని చేసే కాంట్రాక్టర్, విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలిగించి ప్రమాదం బారిన పడకుండా చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



జమ్మికుంట: మొక్క నాటుతున్న బీజేపీ నాయకులు



మానకొండూర్: మొక్క నాటుతున్న నాయకులు

జమ్మికుంట: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాజె రమేశ్ అన్నారు. శనివారం పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేశ్ ఆధ్వర్యంలో డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ పురస్కరించుకొని పట్టణంలోని పలు వార్డుల్లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ శీలం శ్రీనివాస్, పల్లపు రవి, ఠాగూర్ రాకేశ్, ఇటుకాల స్వరూప, మోతే స్వామి, తూడి రవిచంద్రారెడ్డి, మేక సుధాకర్‌రెడ్డి, కొమ్ము అశోక్, మోడెం రాజు, రాము, రాచపల్లి ప్రశాంత్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మానకొండూర్: శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా మండల కేంద్రంలో బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. జిల్లా కార్యవర్గ సభ్యులు అప్పని తిరుపతి, ప్రధాన కార్యదర్శులు సొన్నాకుల శ్రీనివాస్, కత్తి ప్రభాకర్, మార్కొండ రమేశ్, గాడిచర్ల భూమయ్య, కోంద్ర వరప్రసాద్, సుధాకర్, గంగాదేవి, కూన రమేశ్, అరుణ్ పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: కాట్రపల్లి గ్రామంలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో శ్యాం ప్రసాద్ ముఖర్జీ దివస్‌ను పురస్కరించుకొని శనివారం నాయకులు మొక్కలు నాటారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేకల ప్రభాకర్‌యాదవ్ హాజరై మాట్లాడారు. రాముల కుమార్, జానపట్ల శ్యామ్, మోడెపు వినయ్, అనిల్, ముప్పు కోటి, పెరుమల కోటి, రఘు, కార్తీక్ తదితరులున్నారు.

గంగాధర: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వాములై పర్యావరణ పరిరక్షణకు తమవంతు కృషి చేయాలని బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా హిమ్మత్‌నగర్ గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. రేండ్ల శ్రీనివాస్, సర్వు శ్రీనివాస్, వెంకటేశ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: శ్యాం ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్‌ను పురస్కరించుకొని బీజేపీ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు మండలంలోని పలు గ్రామాల్లో మొక్కలు నాటారు. కందాల రాజేందర్, గురుకుంట్ల సాంబయ్య, ఉప్పుల రమేశ్, ఆరెల్లి శ్రీనివాస్, పుట్ట శ్రీధర్, సమ్మయ్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

తృణధాన్యాల సాగుతో అధిక లాభాలు



నవాబుపేట్‌లో రైతులకు వివరిస్తున్న రామారావు

చిగురుమామిడి: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఒక్క రైతు తృణధాన్యాల సాగును ఎంపిక చేసుకొని లాభాలు గడించాలని నవక్రాంతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ ప్రతినిధులు కోరారు. శనివారం నవాబుపేట్, గాగిరెడ్డిపల్లి గ్రామాలకు చెందిన రైతులతో కలిసి క్షేత్రస్థాయి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సమన్వయకర్త రామారావు మాట్లాడుతూ.. వేసవిలో వరి కంటే పెసర, బబ్బెర, మినుములు, జొన్నలు, శనగలు, గోధుమలు, రాగులు, సజ్జలు, జీలుగతో పాటు పలు తృణ ధాన్యాల సాగు ద్వారా పెట్టుబడి తక్కువగా ఆదాయం ఎక్కువగా వస్తుందన్నారు. రైతులు మూస పద్ధతికి స్వస్తి పలికి ఆధునాతన పద్ధతిని అవలంబించి అధిక లాభాలు గడించొచ్చని అన్నారు. క్షేత్ర సిబ్బంది రమేశ్, సాయి. కిరణ్, తిరుపతి, జితేంద్రరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతుబంధు ఐదెకరాలకే పరిమితం చేయాలి



మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాస్

చొప్పదండి: రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధును రైతు భరోసాగా మారుస్తున్నందున ఐదెకరాల వరకున్న రైతులకే పరిమితం చేయాలని రైతులు సూచించారు. చొప్పదండి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో శనివారం జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ వెల్మ మల్లారెడ్డి ఆధ్వర్యంలో రైతులతో సమావేశం నిర్వహించి రైతుబంధుపై సమీక్ష జరిపారు. పలువురు రైతులు పదెకరాల వరకు గల రైతులను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులు, పింఛన్ తీసుకునేవారికి రైతుబంధు ఇవ్వడం సరికాదన్నారు. రైతుల ఆకాంక్షను ప్రభుత్వానికి తెలియజేస్తామని డీఏవో శ్రీనివాస్, చైర్మన్ వెల్మ మల్లారెడ్డి అన్నారు. ఏఈ వంశీకృష్ణ, సీఈవో కళ్లెం తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షుడు ముద్దం మహేశ్‌గౌడ్, ఎంపీటీసీ కోటేశ్, డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చెరువు మత్తడి పైపులు తొలగింపు



తొలగించిన పైపులు

శంకరపట్నం: కన్నాపూర్ గ్రామ శివారులో శనివారం చెరువు మత్తడి పైపులను ఓ వ్యక్తి జేసీబీతో తొలగించారు. కన్నాపూర్ గ్రామంలోని కిష్కిందకాలనీకి చెందిన రైతులు, ప్రజలు వ్యవసాయ బావులు, పోచమ్మ గుడికి వెళ్లేందుకు గతంలో వానాకాలంలో మత్తడి దూకుతుండగా వరద నీటిలో దాటి వెళ్లేవారు. మత్తడికి పైపులు వేసి పైనుంచి మట్టి పోసి బాట ఏర్పాటు చేసుకున్నారు. మత్తడిపై వేసిన పైపులతో పొలం కొంతమేర మునుగుతోందని ఓ వ్యక్తి జేసీబీతో పైపులు తొలగించి ట్రాక్టర్‌లో పట్టుకుపోవడంతో వివాదం చోటుచేసుకుంది. అధికారులు స్పందించి పైపులు వేయించాలని రైతులు కోరుతున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



మాట్లాడుతున్న విష్ణు

జమ్మికుంట: విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కోశాధికారి లద్దునూరి విష్ణు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. నాయకులు సిద్ధు, చందు, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

చొప్పదండి: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్ డిమాండ్ చేశారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వెంటనే అమలు చేయాలని కోరారు.

హుజూరాబాద్: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలు, స్కాలర్‌షిప్‌లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఫీజు బకాయిలను చెల్లించకపోవడంతో కళాశాల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని బకాయిలో ఉన్న ఫీజు బకాయిలను విడుదల చేయాలని అన్నారు.

పాల సంఘాల అధ్యక్షుల ఎన్నిక

చిగురుమామిడి: సుందరగిరి, గాగిరెడ్డిపల్లి గ్రామాల పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలకు నూతన అధ్యక్షులను ఎన్నుకున్నారు. సంఘం కార్యాలయాల ఆవరణలో ఎన్నికలు నిర్వహించారు. సుందరగిరి పాల సంఘం అధ్యక్షుడిగా తిరుపతి ఎన్నికయ్యారు. నూతన డైరెక్టర్లుగా గండికోట చిన్న శ్రీనివాస్, ఎనగంగుల శారద ఎన్నికైనట్లు రూట్ సూపర్‌వైజర్ సీత రవి తెలిపారు. గాగిరెడ్డిపల్లి పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షుడిగా భూమయ్య ఎన్నికైనట్లు చెప్పారు.

పౌర హక్కుల దినోత్సవం

చొప్పదండి: భూపాలపట్నంలో శనివారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఎంపీపీ చిలుక రవీందర్, జెడ్పీటీసీ మాచర్ల సౌజన్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మండల స్థాయి అధికారులు, సిబ్బంది, అంబేడ్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.